

చెరువులో అక్రమ నిర్మాణం

జల్‌పల్లి పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతోంది. ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఓ వ్యక్తి ఏకంగా పట్టర్ నిర్మాణ పనులు ప్రారంభించాడు. 8లో▸

టెన్త్ పరీక్షలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదోతరగతి పరీక్షల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకనుగుణంగా విద్యార్థులు ఉదయం 8.45 లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా బస్సులను అందుబాటులో ఉంచుతారు.

ఈ నెల 30న మద్యం దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 30న శ్రీరామనవమి పండుగ సందర్భంగా నగరంలోని అన్ని వైన్స్ షాపులు, బార్‌లు, కల్లు దుకాణాలు మూసి ఉంచనున్నట్లు ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మరునటి రోజు ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

తైబజార్ @ రూ.90.15 లక్షలు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

తుక్కుగూడ: మున్సిపల్ కేంద్రంలోని వార సంత (తైబజార్)కు 2023–24 సంవత్సరానికిగాను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా కె.ప్రవీణ్‌చారి రూ.90.15 లక్షలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రామ్,వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ రవినాయక్,నాయకులు శివయ్య, సుధా కర్, శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో డీఈఓ సుశీందర్‌రావ్

ఆమనగల్లు: ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా డీఈఓ సుశీందర్‌రావ్ ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని అన్నారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు 2022–23 సంవత్సరానికి నిర్వహించిన కేంద్రీయ ఉపకార వేతనాలకు ఎంపిక కావడంతో మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు విజయ్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్‌రావ్, విఘ్నేశ్‌ను డీఈఓ ఘనంగా సత్కరించారు. అనంతరం డీఈఓ సుశీందర్‌రావ్ మాట్లాడుతూ.. ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్ నాయక్, స్థానిక నాయకులు రాజమోని జంగయ్యయాదవ్, కొప్పుల వెంకటయ్యగౌడ్, శ్రీశైలం, భూపేశ్‌చారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఆన్‌లైన్ జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులకు ఈ నెల 30న ఆన్‌లైన్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఫార్మసీ, బీఫార్మసీ చదివిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. పదో తరగతి, ఇంటర్,డిగ్రీ చదివిన మెడికల్ స్టోర్‌లో అనుభవం ఉన్న అభ్యర్థులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేతనం నెలకు రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందన్నారు. అపోలో ఫార్మసీలో 100 ఖాళీలు ఉన్నాయని, జిల్లాలో పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 82476 56356, 90630 99306 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రంగంలోకి ఎస్‌బీ.. ఇంటలిజెన్స్ అధికారులు!

- సాక్షి కథనంతో కదలిక
- పోలీసు అధికారి తీరుపై అంతర్గత విచారణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'ఆ సారు.. రూటే వేరు' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దుమారం రేపింది. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ తతంగం నడిచిందనే దానిపై జనం ఆరా తీశారు. పోలీసులే ఇలా ప్రవర్తిస్తే.. ఎవరితో చెప్పుకొంటామని మాట్లాడుకున్నారు. సదరు పోలీసు అధికారి తీరును తప్పుబట్టారు. మరోవైపు ఈ కథనంపై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు వేగవంతం చేసినట్టు తెలిసింది. ఆరోపణలపై అంతర్గతంగా విచారణ జరపాలని ఎస్‌బీ, ఇంటలిజెన్స్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. విచారణ అనంతరం సదరు అధికారిపై వేటు పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ఆ అధికారిపై పలు ఫిర్యాదులు ఉన్నట్లు సమాచారం.

గుర్తింపు లేకున్నా..

ప్రైవేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు

- ఇటీవల ఓ స్కూల్‌ను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు
- తాళాలు పగులగొట్టి తరగతుల నిర్వహణ
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ



సరూర్‌నగర్ మండలం చెరుకుతోట కాలనీలోని ఓ స్కూల్‌కు వేసిన సీల్ (ఫైల్)



ప్రస్తుతం కొనసాగుతున్న తరగతులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పలు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నుంచి కనీస అనుమతి పొందకుండానే అడ్మిషన్లు స్వీకరించి, గుట్టుగా తరగతులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏదైనా స్కూలును సీజ్ చేసినా..గంటల వ్యవధిలోనే తిరిగి తెరుచుకుంటుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరూర్‌నగర్ మండలం చెరుకుతోట కాలనీ, కొత్తపేట న్యూమారుతీ నగర్ సహా కర్మన్‌ఘాట్‌లో గుర్తింపు లేని మూడు కార్పొరేట్ స్కూళ్లకు అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. వీటిలో రెండు స్కూళ్లను సీజ్ చేశారు. చెరుకుతోట కాలనీలోని కార్పొరేట్ స్కూలు యాజమాన్యం సీజ్ చేసిన గదులకు తాళాలు పగులగొట్టి గుట్టుగా మళ్లీ తరగతులు నిర్వహిస్తోంది. ఈ విషయం తెలిసీ జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు. ఆర్‌జేడీ అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, విచారణ ప్రారంభించినట్లు తెలిసింది.

ఒకే గుర్తింపుతో రెండు మూడు బ్రాంచ్‌లు

జిల్లాలో మొత్తం 2,863 స్కూళ్లు ఉండగా, వీటిలో 1,319 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 6.84 లక్షల మంది విద్యాభ్యాసం సాగిస్తున్నారు. అనధికారికంగా మరో 45 స్కూళ్ల వరకు ఉన్నట్లు అంచనా. సరూర్‌నగర్, వనస్థలిపురం, మొయినాబాద్, రాజేంద్రనగర్‌లో ఈ తరహా విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. వీటిలో మెజార్టీ స్కూళ్లు కార్పొరేట్ సంస్థలకు సంబంధించినవే. కొన్ని యాజమాన్యాలు ఒకటి నుంచి ఏడు వరకు గుర్తింపు తీసుకుని..ఎనిమిది, తొమ్మిది తరగతులు నిర్వహిస్తుండగా.. మరికొన్ని ఏకంగా ఒకే గుర్తింపుతో రెండు మూడు చోట్ల తరగతులు నిర్వహిస్తున్నాయి. వీటికి విద్యాశాఖ నుంచి ఎలాంటి గుర్తింపు లేదు. ఈ భవనాలకు జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపకశాఖల నుంచి అనుమతులు లేవు. కనీస భద్రత ప్రమాణాలు కూడా లేని భవనాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయడం, గుట్టుగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇదిలా ఉంటే వనస్థలిపురంలోని ఓ స్కూలుకు భవన నిర్మాణానికి ముందే జీహెచ్‌ఎంసీ, ఫైర్‌శాఖల నుంచి ఎన్‌ఓసీలు రావడం, విద్యాశాఖ దానికి గుర్తింపు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. డొనేషన్ల పేరుతో విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. స్కూలు యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోకపోగా, వారి నుంచి పెద్ద మొత్తంలో నజరానాలు పొంది మద్దతుగా నిలుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం



త్వరలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. విద్యాసంస్థలు నిర్వహిస్తున్న భవనాల భద్రత, ఫైర్, జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల నుంచి పొందిన ఎన్‌ఓసీలు, విద్యాశాఖ నుంచి పొందిన గుర్తింపు వంటి అంశాలను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. చెరుకుతోట కాలనీలో సీజ్ చేసిన స్కూలు రీ ఓపెన్ అయిన విషయం మా దృ ష్టికి రాలేదు. సీజ్‌ను తొలగించి..తరగతులు నిర్వహిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవు. ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు, ఎన్‌ఓసీల జారీ విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణల్లో వాస్తవం లేదు.

– సుశీందర్‌రావు, డీఈఓ

అభివృద్ధిలో మనమే ఆదర్శం

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు ఏవీ?
- ఓర్వలేకే ఆ పార్టీ నేతల విమర్శలు
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో వృద్ధులకు రూ.800 పింఛన్ ఇస్తే తెలంగాణలో సీఎం కేసీఆర్ అత్యధికంగా రూ.2 వేలు ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న రైతు బంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్, దళిత బంధు పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలో చేయనటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం కేసీఆర్ చేస్తుంటే ఓర్వలేక బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. పేదలు, మహిళలపై అభిమానం ఉంటే రాష్ట్రంలో గ్యాస్ ధరలు తగ్గించమని రాష్ట్ర బీజేపీ నేతలు ప్రధాని మోదీని అడగాలని కోరారు. దళితబంధులా త్వరలో గిరిజన, బీసీ బంధులను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల అనంతరం తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమీర్‌పేట్‌ను కొత్త మండలముగా ప్రకటిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారం చేసినా మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. అంతకు ముందు మన్సాన్‌పల్లి చౌరస్తా నుంచి సుమారు 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, కార్యదర్శి జి.అంజయ్య ముదిరాజ్, బీసీ సెల్ అధ్యక్షుడు వి.మల్లేశ్ యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గాదె థామస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు పాండు యాదవ్ డి.వెంకటేశ్వర‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఎంపీటీసీ కుమారి రాయప్ప, ఉప సర్పంచ్ నర్సింగ్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళలను సన్మానించి అవార్డులు అందజేశారు. సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ హరీశ్, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కుట్ర పూరితంగానే రాహుల్‌పై వేటు



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి


- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: కుట్ర పూరితంగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. బడంగ్‌పేట చౌరస్తాలో మంగళవారం సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని దేశ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. భారత్ జోడో పేరుతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజలను ఏకతాటిపైకి తెస్తుంటే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీని దెబ్బ తీసేందుకు ఇలాంటి నీచమైన కుట్రలకు తెగించారని ధ్వజమెత్తారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత, పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ సంపదనంతా అదానీకి దోచి పెడుతూ.. దేశాన్ని ఆర్థికమాంద్యం వైపు నడిపిస్తున్న సత్యాన్ని దేశ ప్రజలకు ఎక్కడ రాహుల్ చెబుతాడోనని భయం వేసి ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పీసీసీ కార్యదర్శి బంగారు బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు పందుల వెంకటేశ్, మీర్‌పేట్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

కేశంపేట: నిరుద్యోగులు, యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న గ్రంథాలయాలకు అదనంగా 30 పౌర పఠన మందిరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని నిర్ధవెల్లి, వేములనర్వతో పాటు మరికొన్ని మేజర్ గ్రామాల్లో పౌరపఠన మందిరాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 కోట్ల వ్యయంతో ఆరు గ్రంథాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. షాద్‌నగర్, శంషాబాద్, మంచాల, ఆమనగల్లులో నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మిగతా భవనాల నిర్మాణాలు చేపట్టనున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దినట్టు వెంకటరమణారెడ్డి తెలిపారు. పాఠకులు డిమాండ్ చేసిన పుస్తకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, మండల గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి విద్యావతి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

రాజ్యాంగ విరుద్ధంగా బీజేపీ పాలన

- కలిసొచ్చే పార్టీలతో దేశవ్యాప్త పోరు
- రాహుల్‌పై అనర్హత వేటు దుర్మార్గపు చర్య
- రాష్ట్రంలో పొత్తు పొడిస్తే ఇబ్రహీంపట్నం బరిలో ఉంటాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం: కేంద్రంలో బీజేపీని వ్యతిరేకించే పార్టీలతో కలిసి పనిచేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ.. బీజేపీ సాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు దేశవ్యాప్తంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ విరుద్ధంగా దేశంలో బీజేపీ పాలన కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినట్లుగా పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేస్తామని తమ్మినేని తెలిపారు. వామపక్షాలు, బీఆర్‌ఎస్ పార్టీలు రానున్న ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తే, పొత్తులో భాగంగా ఇబ్రహీంపట్నం నుంచి సీపీఎం బరిలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జాన్‌వెస్లీ, జంగారెడ్డి, యాదయ్య, సామేల్, జగదీశ్, రాజు, కవిత పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో పోటీ చేస్తాం

మంచాల: వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని ఆరుట్ల, మంచాల, జాపాల, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాల్లో మంగళవారం జన చైతన్య యాత్ర కొనసాగింది. ఆరుట్లలో నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి పగుడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అవార్డుల పంట

- మంత్రి సబితారెడ్డి
- అట్టహాసంగా జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కలెక్టర్ హరీశ్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండిందని, కలిసికట్టుగా పని చేయడంతోనే ఇది సాధ్యమైందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఎంపిక చేసిన తొమ్మిది అంశాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన పాలక వర్గాలకు మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందడంతో పాటు, దాని పరిధిలోని ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రానికి జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. ప్రభుత్వ సుపరిపాలనతో జాతీయ స్థాయిలో వరుస అవార్డులు వరిస్తున్నాయన్నారు. 2021–22 సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద కేంద్రం దేశ వ్యాప్తంగా 20 ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేయగా, అందులో తెలంగాణలోని 19 గ్రామాలు ఉత్తమ జీపీలుగా ఎంపికయ్యాయని వివరించారు. గతంలో కేంద్రం పంచాయతీలకు అందించే అత్తెసరు నిధులు నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే సరిపోయేవని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి తెలంగాణలో పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, కేంద్రం అందిస్తున్న నిధులకు సరిసమానంగా స్టేట్ ఫైనాన్స్ ద్వారా నిధులు సమకూరుస్తోందని తెలిపారు. దీంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు వృద్ధి చెందాయని, ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగయ్యాయన్నారు. ఇకముందు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జెడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రభాకర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొమురయ్య జయంతి అధికారికంగా జరపాలి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుర్మ సంఘం నేతలు

మంత్రి కేటీఆర్‌ను కోరిన
కుర్మ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఏ మల్లేశం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కే మల్లేష్ కోరారు. మంగళవారం నగరంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అలాగే కుర్మ సంఘం భవన నిర్మాణం పూర్తయ్యిందని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభానికి సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుష్ప నాగేష్, అరుణ్, మాజీ కార్పొరేటర్ ఏ మధు పాల్గొన్నారు.

ఏపీలో గురుకులాలకు సహకరించాలి

- సీఎం జగన్‌ను కోరిన హిమాయత్‌నగర్ స్వామి నారాయణ గురుకుల విద్యాలయ స్వామీజీలు
- విశాఖపట్నం, తిరుపతి, పులివెందులలో ఏర్పాటుకు సానుకూలం



ఏపీ సీఎం జగన్‌తో స్వామి నారాయణ గురుకుల విద్యాలయాల స్వామీజీలు

మొయినాబాద్ రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో స్వామి నారాయణ గురుకుల విద్యాలయాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని తెలంగాణకు చెందిన ఆ విద్యాలయాల స్వామీజీలు, ట్రస్ట్ సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ స్వామి నారాయణ గురుకుల విద్యాలయాల స్వామీజీలు, ట్రస్ట్ సభ్యులు ఏపీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తిరుపతిలో గురుకులాల ఏర్పాటుకు సహకరించాలని కోరినట్లు వారు తెలిపారు. స్వర్గీయ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొయినాబాద్ మండలం కనకమామిడి సమీపంలో స్వామి నారాయణ గురుకుల యూనివర్సిటీ ఏర్పాటుకు వంద ఎకరాలు కేటాయించేందుకు సన్నాహాలు జరిగినట్లు జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. వైఎస్ అకాల మరణంతో ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందన్నారు. భారత్‌తోపాటు ఇతర దేశాల్లో 52కు పైగా విద్యా సంస్థలు నిర్వహిస్తున్నట్లు జగన్‌కు వివరించినట్లు తెలిపారు. ఏపీలో గురుకులాల ఏర్పాటుకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. విశాఖపట్నం, తిరుపతితో పాటు పులివెందులలో గురుకులాలు ఏర్పాటు చేసుకోవచ్చని సీఎం జగన్ సూచించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుకువల్లభ్ స్వామి, స్వారూప్ స్వామి, శ్రావణ్ ప్రియ స్వామి, విశ్వస్ స్వామి, మంత్రి స్వరూప్ స్వామి, మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల రిమాండ్

యాచారం: కందుకూరు మండలం మీరాఖాన్‌పేట, యాచారం మండలం కుర్మిద్ద గ్రామాల్లో బైక్, ఆటోల దొంగతనాలను పాల్పడిన ముగ్గురిని యాచారం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ మండలం మదనాపల్లికి చెందిన శ్యామ్, శివకుమార్, శ్రీ చరణ్ ఆదివారం రాత్రి మీరాఖాన్‌పేటలో ఒక బైక్‌ను, కుర్మిద్ద గ్రామంలో ఆటోను తరలిస్తుండగా ఆయా గ్రామాల ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. నిందితులపై గతంలో పలు కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

బంగారం పట్టివేత

ఇద్దరు ప్రయాణికుల నుంచి
కిలో బంగారం స్వాధీనం

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం దుబాయ్ నుంచి ఈకే-524 విమానంలో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని తనిఖీ చేశారు. మలద్వారంలో బంగారం తీసుకొచ్చినట్లు తేలడంతో అతడికి శస్త్రచికిత్స చేయించి మూడు బంగారు క్యాప్సుల్స్‌ను బయటకి తీశారు. 840 గ్రాముల బరువు కలిగిన బంగారం విలువ రూ. 51.24 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ డబ్బాల్లో

దుబాయ్ నుంచి వచ్చిన మరో ప్రయాణికుడిని తనిఖీ చేయగా అతడు ట్యూనాఫిష్ ఆయిల్ తీసుకొచ్చిన టిన్ డబ్బాలో 233 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ. 14.23 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి పేరుతో రూ. 28లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: టెలిగ్రామ్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు నగర యువకుడికి భారీగా టోకరా వేశారు. పార్ట్‌టైం జాబ్ పేరుతో గాలం వేసి పరిచయం పెంచుకున్నారు. జాబ్‌తో పాటు ఇన్వెస్ట్ చేయాలని కోరారు. తొలిరోజుల్లో చేసిన పెట్టుబడులకు కొద్దిపాటి లాభాలు ఇచ్చి నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. ఆ తర్వాత పెట్టిన పెట్టుబడికి లాభాలు ఇవ్వకపోగా టాస్కులు పూర్తి చేస్తే ఇస్తామన్నారు. ఇలా పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ.28లక్షలు నుంచి కాజేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం అతను సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



నిందితుడు బహదూర్

నాగోలు: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 25 వేల జరిమానా విధిస్తూ మంగళవారం రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు తీర్పు తీర్పు చెప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్తినాపురం, దేవకమ్మ తోట వద్ద బనబాసి నహక్ అలియాస్ బహదూర్ (50) వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. సమీపంలో ఇంట్లో ఓ కుటుంబం నివాసం ఉండేది. 2017 జనవరి 1న తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై బహదూర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం మంగళవారం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి ప్రభుత్వం రూ. 6 లక్షలు పరిహారం అందజేసింది.

తెలుగు పాటకు ఆస్కార్ అభినందనీయం

- చంద్రబోస్‌కు త్వరలో సన్మానం
- మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

గన్‌ఫౌండ్రీ: ఆసియా ఖండంలోనే పాటల రచయితకు మొట్టమొదటిసారి ఆస్కార్ అవార్డు దక్కడం గొప్ప విషయమని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ, గ్రంథాలయ పరిషత్, తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదికలతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత చంద్రబోస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 95 ఏళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణలో కవులే లేరని, గతంలో అవహేళన చేశారని కానీ నేడు విశ్వవ్యాప్తంగా తెలంగాణ కవులు సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. ఆస్కార్ అవార్డు సాధించిన చంద్రబోస్‌ను త్వరతలో ప్రభుత్వం తరఫున ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. సినీనటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ఆస్కార్ అంటే హాలీవుడ్‌కు మాత్రమే పరిమితమైందని, కానీ చంద్రబోస్ ఆ చరిత్రను తిరగరాశారని కొనియాడారు.

కవిగా గర్వించే క్షణాలు: చంద్రబోస్

ఒక కవిగా తనకు లభించిన ఈ గుర్తింపు ఎంతో గర్వించదగ్గ క్షణాలని సినీ గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. 'నాటు నాటు' పాట కోసం సంగీత దర్శకుడు కీరవాణితో పాటు తాను సంవత్సరం పాటు చేసిన కృషికి ప్రతిఫలం దక్కడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నాటు నాటు పాటపాడి సభికులను ఆనందపరిచారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరి గౌరీశంకర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, చంద్రబోస్ తండ్రి నర్సయ్యలతో పాటు పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్రాక్ష సాగును ప్రోత్సహిస్తాం



కంటి వెలుగు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- తుక్కుగూడలో ద్రాక్ష తోట సందర్శన

తుక్కుగూడ: జిల్లాలో ద్రాక్ష సాగును ప్రోత్సహిస్తామని మంత్రి పీ సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడ పరిధిలో రైతు కే అంజిరెడ్డి సాగు చేసిన ద్రాక్ష తోటను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులు అనేక రకాల పండ్ల తోటలను సాగు చేసేవారన్నారు. క్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. ఇతర పంటలు సాగు చేసిన రైతులు అనేక కష్టాల నష్టాలు భరించారని, ప్రస్తుతం పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించారని తెలిపారు. అంజిరెడ్డి తన 20 ఎకరాల్లో ద్రాక్ష పంటను సాగు చేశాడని, ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చిందని తెలిపారు. కోహెడ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసే పండ్ల మార్కెట్లో ద్రాక్ష విక్రయాల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తాము రైతులను కలిసి వారి కష్టాలను తెలుసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

13వ వార్డులో 'కంటి వెలుగు'

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సబితారెడ్డి సూచించారు. మంగళవారం తుక్కుగూడ 13వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలోచనల నుంచి పుట్టినదే కంటి వెలుగు అన్నారు. మానవ శరీరంలో కంటి చూపు ప్రధానమన్నారు. కంటి చూపు పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ సీ లావణ్య, మున్సిపల్ చైర్మన్ కే మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రామ్, వైస్ చైర్మన్ భవాని, కౌన్సిలర్లు రవినాయక్, సుమన్, రాజు, బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

30 నుంచి రాచకొండ పరిధిలో ఆంక్షలు

శ్రీరామ నవమి ఉత్సవాలు, రంజాన్ మాసం, ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో..

ఉప్పల్: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ నెల 30 నుంచి సభలు సమావేశాలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా కమిషనరేట్ పరిధిలో ఎలాంటి సభలు, సమా వేశాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. శ్రీరామ నవమి ఉత్సవాలు, రంజాన్ మాసం, ఉప్పల్‌లో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏప్రిల్ 3 వ తేదీ ఉదయం వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

30న మద్యం దుకాణాల బంద్

శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 30న రాచకొండ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కల్లు దుకాణాలు, వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, మిలిటరీ క్యాంటిన్‌లు సైతం మూసి వేస్తున్నట్లు సీపీ పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో అక్రమ నిర్మాణం



జల్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో కొనసాగుతున్న షట్టర్ నిర్మాణ పనులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతోంది. ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఓ వ్యక్తి ఏకంగా షెట్టర్ నిర్మాణ పనులు ప్రారంభించాడు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి కావచ్చాయి. రోడ్డుకు సమీపంలో చెరువు ఉండడంతో అక్రమ నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. చెరువు పరిధిలో వ్యవసాయ భూములు ఉంటే వాటిని కేవలం సాగు మాత్రమే వినియోగించాలి. కానీ ఓ వ్యక్తి ఏకంగా కమర్షియల్ నిర్మాణాలు మొదలు పెట్టాడు. చెరువు కబ్జాకు గురికావడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో ప్రభుత్వ భూములు కబ్జా బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. జల్‌పల్లి చెరువు పరిసరాల్లో కబ్జా విషయమై ఫిర్యాదు వచ్చింది. చెరువును పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే తమకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– జనార్దన్‌రావు,
తహసీల్దార్, బాలాపూర్

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పోలీసుల అదుపులో నిందితులు



ఇంట్లో గుప్త నిధుల కోసం చేపట్టిన తవ్వకాలు

రాజేంద్రనగర్: గుప్త నిధుల కోసం ఇంట్లో తవ్వకాలు చేపడుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో రాజేంద్రనగర్ పోలీసులు దాడిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుద్వేల్ పాత మున్సిపల్ కార్యాలయం పక్కనే గతంలో నిర్మించిన ప్రహరీ పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. దీని పక్కనే నాగులు అనే వ్యక్తి ఇంటిని నిర్మించి తన కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. రిటైర్డ్ ఉద్యోగి అయిన నాగులు మనమడు వినోద్ మొయినాబాద్ హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందినవాడు. వినోద్‌తో కొందరు మీ తాత ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని పూజలు చేసి బయటకు తీస్తామని వెల్లడించారు. దీంతో 12 రోజుల క్రితం ఇంట్లో పూజలు నిర్వహించారు. అనంతరం మూడ్రోజులుగా తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలో పూజలు నిర్వహించడం, ఉదయం తవ్వకాలు చేపడుతుండడంతో చుట్టూ పక్కల వారికి అనుమానం వచ్చి రాజేంద్రనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి సదరు ఇంటిపై నిఘా పెట్టారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఫలక్‌నూమా, బషీర్‌బాగ్, హిమాయత్‌సాగర్ ప్రాంతాలకు చెందిన ఖదీర్, కృష్ణమోహన్, దివ్యాసా, హరిప్రీత్‌సింగ్, విశ్వనాథ్, కట్ట శివసాయి, రామకృష్ణతోపాటు వినోద్‌ను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి మూడు కార్లతో పాటు 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అనుమానం రాకుండా విందు

నాగులు ఇంట్లో 12 రోజుల క్రితం పూజలు నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో స్థానికులతో పాటు స్నేహితులు పాల్గొన్నారు. ఇంట్లో పూజలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా విందు ఏర్పాటు చేసినట్లు నాగులు, వినోద్ వెల్లడించారు. దీంతో ఎవరికి అనుమానం రాలేదు. మూడు రోజులుగా మంత్రాలు, అరుపులు, కేకలు వేస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గుప్త నిధుల విషయం బయటకు వచ్చింది.

జిల్లాస్థాయి పురస్కారం అందజేత

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం పంచాయతీకి జిల్లాస్థాయి పురస్కారాన్ని అందజేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన మల్కారం పంచాయతీ తరఫున సర్పంచు మాధవియాదగిరిరెడ్డికి మంత్రి సబితారెడ్డి పురస్కారం అందజేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీటీసీ తన్వీరాజు, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఉప సర్పంచు లలిత పాల్గొన్నారు.





ఇదేం రాజకీయం..!

ప్రచారానికి కాదేది అనర్హం అని నేతలు నిరూపిస్తున్నారు. త్వరలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండడంతో పలు పార్టీల నాయకులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్నారు. అయితే వాటిని కూడా రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. సేవా భావంతో ఇవ్వాల్సిన పరీక్ష ప్యాడ్లపై పార్టీల గుర్తులు, నాయకుల ఫొటోలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదని పలువురు ఆరోపిస్తున్నారు.

– మొయినాబాద్